సాక్షి నిజామాబాద్

ఆదివారం । 20 । జూలై । 2025



చదువులో వెనకబడిన..

చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక బోధన అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు.

- 8లో ▸



టెక్నాలజీని సమర్థవంతంగా..

పారదర్శకత, వేగవంతమైన సేవలకు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించాలని సీపీ సాయిచైతన్య అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.3 /23.9

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఈ-పాస్ ద్వారానే యూరియా విక్రయించాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): ఈ-పాస్ యంత్రాల ద్వారానే రైతులకు యూరియా విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద్ అన్నారు. కృత్రిమ కొరత సృష్టించినా, ఎక్కువ ధరలకు విక్రయించినా డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలు, గోదాములను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, అమ్మకాల్లో తేడాలు రావొద్దన్నారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. రైతులు తమ అవసరం మేరకు దఫాల వారీగా తీసుకెళ్లాలని సూచించారు. మోతాదులోనే పంటలకు యూరియా వేయాలని లేదంటే చీడపీడలు పెరిగి దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. డీఏవో వెంట నిజామాబాద్ అర్బన్ ఏడీఏ వీరాస్వామి, ఎంఏవో మహేందర్‌రెడ్డి, ఏఈవో చక్రపాణి ఉన్నారు.

25, 26 తేదీల్లో అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26వ తేదీల్లో నాగారంలోని రాజారాం స్టేడియంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న అండర్- 8, 10, 12, 14, 16 బాలబాలికలకు, 26న అండర్ 18, 20, బాలబాలికలు, స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. 40 మంది బాల బాలికలను ఆగస్టు 3, 4 తేదీల్లో జేఎన్ స్టేడియం హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. జనగామ జిల్లాలో ఆగస్టు 7న నిర్వహించే రెండవ రాష్ట్రస్థాయి పోటీలకు 20 మంది బాల బాలికలను పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 99890 40776 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జీరో యాక్సిడెంట్ లక్ష్యంలో భాగస్వాములు కావాలి

సుభాష్‌నగర్: జీరో యాక్సిడెంట్ లక్ష్యంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు భాగస్వాములు కావాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ ఆర్ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రమాదభరితంగా, వదులుగా ఉన్న విద్యుత్ తీగలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు, వంగిన స్తంభాలు, రోడ్లు మీదుగా తక్కువ ఎత్తులో ఉన్న లైన్ క్రాసింగ్ వంటి ప్రమాదకరంగా ఉన్న వాటిని గమనించిన వెంటనే సెక్షన్ ఆఫీసర్ (అసిస్టెంట్ ఇంజినీర్ ఆపరేషన్), గ్రామస్థాయిలో ఉండే లైన్‌మెన్‌కు తెలియజేయాలని సూచించారు. తమ దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యలను సిబ్బంది పరిష్కరిస్తారని, తద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించొచ్చన్నారు. పశువులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల వద్దకు వెళ్లకుండా చూడాలని కాపర్లకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే టీజీఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని ఎస్‌ఈ కోరారు.

స్మార్ట్ ముప్పు

సైకియాట్రిస్ట్‌ల వద్ద పెరుగుతున్న కేసులు.. నెలకు వంద వరకు

- మానసిక స్థితిని ప్రభావితం చేస్తున్న సెల్‌ఫోన్
- గ్రౌండ్ తెలీదు.. క్రీడలపై ఆసక్తి లేదు
- శారీరక వ్యాయామమూ లేదు

సండే స్పెషల్



చందమామ రావే.. అంటూ చిన్నారికి గోరు ముద్దలు తినిపించాల్సిన తల్లి పని త్వరగా అయిపోవాలనే ఆతృతతో స్మార్ట్‌ఫోన్‌లో కార్టూన్‌లను చూపుతోంది. ఫలితంగా సెల్‌ఫోన్ చేతిలో లేనిదే ఆ చిన్నారి అన్నం తినలేని పరిస్థితి వస్తోంది. ఆన్‌లైన్ క్లాస్‌లు వింటారని సెల్‌ఫోన్ కొనిచ్చిన తల్లిదండ్రులు చివరకు తమ పిల్లలు వాటికి బానిసలు కావడాన్ని చూసి తలలు పట్టుకుంటున్నారు. సెల్‌ఫోన్‌ల పుణ్యమాని పిల్లలకు మాటలు రావాల్సిన వయస్సులో మాటలు రావడం లేదు.. స్కూల్‌కి వెళ్లే పిల్లలకు కనీసం వ్యాయామం అంటే తెలియడం లేదు. కూర్చున్న చోటు నుంచి గంటలపాటు కదలకుండా సెల్‌ఫోన్‌లు పట్టుకుంటున్నారు. ఈ పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

– నిజామాబాద్‌అర్బన్

✤ తొమ్మిదో తరగతి చదివే కొడుకు స్మార్ట్ ఫోన్‌ను బాగా ఆపరేట్ చేస్తున్నాడని, ఆన్‌లైన్ చెల్లింపులను పక్కాగా చేస్తున్నాడని మురిసిపోయింది జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతానికి చెందిన ఓ ప్రభుత్వ టీచర్. ఎప్పు డూ ఫోన్ పట్టుకుని కూర్చుంటున్న కొడుకు పబ్జీ గేమ్‌కి అలవాటు పడి తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.60వేలు ఖర్చు చేశాడని గుర్తించి విస్తుపోయింది. ఈ విషయంలో మందలించడంతో పక్క గదిలోకి వెళ్లిన ఆ బాలుడు ఉరేసుకొనే ప్రయత్నం చే యగా ఆ తల్లి అడ్డుకుని ఆస్పత్రికి తీసుకెళ్లింది.

✤ బోధన్‌లోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బా లుడు ప్రతి రోజూ తరగతి గదిలో నిద్రపోతున్నాడు. విషయాన్ని టీచర్లు బాలుడి తల్లిదండ్రులకు తెలుపగా.. తాము నిద్రించిన తరువాత అర్ధరాత్రి నిద్రలేస్తున్న బాలుడు 2 గంటల నుంచి తెల్లవారుజా ము 5గంటల వరకు యూట్యూబ్ చూస్తున్నట్లు గుర్తించారు.

✤ ధర్పల్లికి చెందిన ఓ మహిళ ఇటీవల జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తన ఏడేళ్ల కొడుకును తీసుకొచ్చింది. ఫోన్ లేకుండా ఒక్క క్షణం ఉండడం లేదని, యూట్యూబ్ పెడితే తప్ప అన్నం తినడంలేదని, ఫోన్ ఇవ్వకపోతే తమను ఎదిరిస్తున్నాడని వాపోయింది. ఆస్పత్రిలో ఉంచి ఒక్క రోజు ఫోన్ ఇవ్వకపోవడంతో ఆ బాలు డు వస్తువులను పగులగొట్టాడు.

✤ మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ఓ జంట తమ కూతురు మాట్లాడే భాష అర్థం కాక ఓ మానసిక వైద్యుడి వద్దకు తీసుకొచ్చింది. ఆమెను పరీక్షించి పూర్తి వివరాలు తెలుసుకున్న వైద్యుడు.. ఆ తల్లి ప్రతి రోజూ తన కూతురికి అన్నం తినిపించేందుకు ఫోన్ అలవాటు చేసిందని, ఇతర భాషల కార్టూన్లు చూడడంతోనే ఈ పరిస్థితి అని గుర్తించాడు.



ప్రపంచాన్ని అర చేతిలో చూయించే సెల్‌ఫోన్ అన్ని వయస్సుల వారిపై చూపుతున్న ప్రభావం అంతాఇంతా కాదు. అంది వచ్చిన టెక్నాలజీని అవకాశంగా మల్చుకుంటున్న కొంత మంది వి ద్యార్థులు, యు వత బంగారు బాట వేసుకుంటుండగా.. మరెంతో మంది తమ భవిష్యత్‌ను చేజేతులారా అంధకారంలోకి నెట్టేసుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్‌కు అలవాటు పడిన విద్యార్థుల మానసిక స్థితిలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సెల్‌ఫోన్ వాడకం తీవ్ర ప్రభావం చూపుతోందని మానసిక వైద్య నిపుణులు అంటున్నారు.

చదువుపై ధ్యాస తక్కువ..

ఫోన్ ఎక్కువగా అలవాటు పడిన వారిలో చదువులపై ధ్యాస తగ్గిపోతోంది. చరవాణి వ్యసనంగా మారితే పిల్లలు ఒంటరిగా ఉండడానికి మాత్రమే ఇష్టపడతారు. ఇంట్లో అందరూ ఉంటే పడకగదిలో తలుపులు వేసుకొని మరి ఫోన్‌కి పరిమితం అవుతారు. సోషల్ మీడియా వినియోగంతో చెడు వ్యసనాలకు అలవాటు పడే ప్రమాదం ఉంది.

ఎప్పుడు చూసినా..

పిల్లలకు అసలు వ్యాయామం అంటే ఏమిటో తెలియని పరిస్థితి ఉంది. ఉదయం లేచింది మొదలు స్కూల్ సమయం వరకు, స్కూల్ నుంచి వ చ్చీరాగానే పడుకునే వరకు చేతుల్లో సెల్‌ఫోన్ ఉండడంతో పిల్లలకు అస లు బయటి ప్రపంచం తెలియకుండాపోతోంది. ఫోన్‌ల కారణంగా ఆటలాడేందుకు ఇష్టపడడం లేదు.

దుష్ప్రభావాలు అనేకం..


- బద్ధకం, మతిమరుపు, మొండితనం
- ప్రతి చిన్న విషయానికి కోపగించుకోవడం, గొడవపడడం
- ఇంట్లోని పెద్దలను ఎదురించడం
- స్నేహితులు లేకపోవడం, బంధుత్వాలు తెలియకపోవడం
- నేర ఘటనలను చూడడం కారణంగా నేరప్రవృత్తి వైపు వెళ్లే ప్రమాదం
- మానసిక ఒత్తిడి పెరిగి అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం



పెరుగుతున్న కేసులు..

సెల్‌ఫోన్‌లకు బానిసలుగా మారిన పిల్లల కేసులు మానసిక వైద్యుల వద్దకు నెలకు సుమారు వంద వరకు వస్తున్నాయని ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు విశాల్ తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల్లో సుమారు 10 మంది మానసిక వైద్యులు ఉన్నారని, ఒక్కొకరికి వద్దకు నెలలో పది వరకు కేసులు వస్తున్నాయంటున్నారు. ఇదిలా ఉండగా కొందరు అవగాహన లేకపోవడంతో వైద్యుల వద్దకు రావడం లేదని పేర్కొన్నారు. చిన్న పిల్లలో రోజురోజుకూ మానసిక సమస్యలు పెరుగుతున్నాయని, సెల్‌ఫోన్ లేనిదే ఉండలేకపోతున్నారని అంటున్నారు.

ఆన్‌లైన్ క్లాసుల పేరిట..



ఆన్‌లైన్ క్లాస్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌ల కోసమని స్కూల్‌కి వెళ్లే 8 నుంచి 15 ఏళ్ల పిల్లలకు తల్లిదండ్రులు సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు కొనిస్తున్నారు. ఇంటర్నెట్ కోసం డాటా ప్యాకేజీ రీచార్జి చేయడం లేదంటే ఇంట్లోనే వైఫై పెట్టిస్తున్నారు. ఇక్కడే చాలా మంది పిల్లలు పక్క దారి పడుతున్నారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసే, వ్యాపారాల్లో బిజీగా ఉండే వారి ఇళ్లలో పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో సుమారు 60 నుంచి 80 శాతం పిల్లలు సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారు. వీరి వద్ద అత్యంత ఖరీదైన సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు ఉంటున్నాయి. 12 ఏళ్లలోపు పిల్లలు 20 శాతం మందికి ఫేస్‌బుక్ ఖాతా ఉంటోంది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ వినియోగం ఎక్కువగా పెరిగింది. పిల్లలు ప్రతి చిన్న విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. వాట్సాప్‌నూ వినియోగిస్తున్నారు. సోషల్ మీడియా ప్రభావం పెరగడంతో 15 ఏళ్ల వయస్సున్న పిల్లలు ప్రేమలో పడుతున్నారు. 18 ఏళ్ల వయస్సు వచ్చే సరికి పరిస్థితి చేయిదాటుతోంది.

సెల్‌ఫోన్ ఆట వస్తువు కాదు



సెల్‌ఫోన్ ఆట వస్తువు కాదని తల్లిదండ్రులు గుర్తించాలి. స్మార్ట్ ఫోన్ వాడకం క్రమంగా పిల్లల్లో వ్యసనంగా మారుతోంది. ఫలితంగా పిల్లల వ్యవహార శైలిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలామందిలో చురుకుదనం తగ్గి సోమరితనం పెరుగుతోంది. రాత్రి 9 గంటలలోపు నిద్ర పోవాల్సిన పిల్లలు అర్ధరాత్రి వరకు ఫోన్‌లు వాడుతున్నారు. ఇది ఆందోళనకర విషయం. పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలి.

– విశాల్, మానసిక వైద్య నిపుణులు

నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం



చిన్న పిల్లలపై ఫోన్ ప్రభావం తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తుంది. ముఖ్యంగా పిల్లలు ఎదిగే సమయంలో నరాలపై ఒత్తిడి పడుతుంది. నిద్ర సమస్యలు వస్తాయి. అదే పనిగా ఫోన్ చూస్తుంటే నరాలు దెబ్బతింటాయి. మానసిక ఎదుగుదల ఉండదు. ఫోన్‌కు దూరంగా ఉండడమే ఉత్తమం. ప్రస్తుతం సెల్ ఫోన్ కారణంగా తలెత్తుతున్న అనర్థాలకు సంబంధించిన కేసులు పెరుగుతున్నాయి.

– సాయిశ్రీపాదరావు, న్యూరో ఫిజీషియన్

ఒత్తిడి జయించలేక..

- తనువు చాలించిన ఇంటర్ విద్యార్థి
- అర్థం కాని ఆంగ్లమాధ్యమ చదువు
- పదో తరగతి వరకు తెలుగు మీడియంలో విద్యాభ్యాసం



సంతోష్ (ఫైల్)

నిజాంసాగర్/ఆర్మూర్ టౌన్ : పదో తరగతి వరకు తెలుగు మీడియం చదువుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థి ఇంటర్‌లో ఆంగ్లమాధ్యమ చదువు అర్థంకాక తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. చివరికి అనంతలోకాలకు వెళ్లిన విషాద ఘటన ఇది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం ఆరేడ్ గ్రామానికి చెందిన గడ్డం నిర్మల, నాగయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. రెక్కల కష్టాన్ని నమ్ముకొని పిల్లలను చదివిస్తున్నారు. చిన్న కుమారుడైన సంతోష్ (17) ఐదో తరగతి నుంచి 10 వ తరగతి వరకు అచ్చంపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించాడు. తెలుగుమీడియం చదువుల్లో ఉత్తమ మార్కులు సాధించాడు. ఇంటర్మీడియట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వేల్పూర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో సీటు వచ్చింది. పదో తరగతి వరకు తెలుగు మీడియం చదివి ఇంటర్‌లో ఇంగ్లిష్ మీడియం కావడంతో ఒత్తిడికి గురయ్యాడు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. సప్లిమెంటరీలో ఒకటి మాత్రమే పాస్ కావడంతో మానసికంగా ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. శనివారం వేకువ జామున సంతోష్ తాను చదువుతున్న గురుకుల పాఠశాలలో తోటి విద్యార్థులతో కలిసి మైదానంలో వ్యాయామం చేశాడు. అనంతరం సంతోష్ తువ్వాలు తీసుకుని కళాశాల గోడ దూకి బయటకు వెళ్లినట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత డిగ్రీ కళాశాల వెనుక ఉన్న నర్సరీలో చెట్టుకు ఉరేసుకుని కనపడ్డాడు. ఇదిలా ఉండగా సంతోష్ ఆత్మహత్యపై అతడి సోదరుడు శ్రీకాంత్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో చాలామంది ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు వచ్చి రెండు నెలలవుతోందని, ఇప్పుడెందుకు ఆత్మహత్య చేసుకుంటాడని ప్రశ్నిస్తున్నారు. కళాశాలలో ఏం జరిగిందో తెలుసుకోవడానికి విచారణ జరిపించాలని కోరారు. సంతోష్ ఆత్మహత్యతో ఆరేడ్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- తెయూలో ప్రజావాణి నిర్వహణ
- సమస్యలు వివరించిన విద్యార్థులు, అధ్యాపకులు



ప్రజావాణిలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గుర్తించిన క్షేత్రస్థాయి ఉన్నత విద్యారంగ సమస్యలను వివరిస్తూ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి అన్నారు. కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ ఎల్.విశ్వేశ్వరరావుతో కలిసి యూనివర్సిటీని మురళి శనివారం సందర్శించారు. బాలికల, బాలుర వసతి గృహాలు, సెంట్రల్ లైబ్రరీ, వివిధ కళాశాలల తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించారు. అనంతరం తెయూ వీసీ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, కమిషన్ సభ్యులు విశ్వేశ్వరరావుతో కలిసి చైర్మన్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. తెయూకు ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలు మంజూరు చేయించాలని, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను తెయూ పరిధిలోకి తేవాలని ఈ సందర్భంగా విద్యార్థులు విన్నవించారు. ముఖ్యంగా ఒకటే బాలికల హాస్టల్ ఉందని, మౌళిక వసతులు, గదులు సరిపోక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నూతన బాలికల హాస్టల్ నిర్మించాలని విద్యార్థినులు కోరారు. ప్రయోగశాలలు, గ్రంథాలయంలో పుస్తకాల కొరత తదితర అంశాలను మురళి దృష్టికి తీసుకెళ్లారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ కోచింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షులు ఏ.పున్నయ్య మాట్లాడుతూ.. ఉన్నత విద్యారంగంలో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలున్నాయన్నారు. దశాబ్ద కాలంగా యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకం జరగడంలేదన్నారు. తెయూ అనుబంధ కళాశాలల రాష్ట్ర సహాయ కార్యదర్శి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, దీంతో కళాశాలలు నిర్వహించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దోస్త్, బకెట్ సిస్టం వంటి అడ్మిషన్స్ నిబంధనలతో ప్రైవేటు కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని తెలిపారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, కంట్రోలర్ ప్రొఫెసర్ కే.సంపత్‌కుమార్, ఆడిట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, ప్రొఫెసర్ కనకయ్య, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి

- గ్రామస్వరాజ్యమే దేశ స్వరాజ్యం
- సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు కృషి చేయాలి
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

నిజామాబాద్‌అర్బన్: గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో ఆర్థిక సంఘం సభ్యులు ఎం రమేశ్, సంకెపల్లి సుధీర్‌రెడ్డితో కలిసి చైర్మన్ రాజయ్య సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు టి.వినయ్ కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్‌లు ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల పనితీరును చైర్మన్‌కు వివరించారు. మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా విడుదల అయిన నిధులు, వాటి వెచ్చింపు వివరాలను గణాంకాల ద్వారా వెల్లడించారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని అన్నారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణంతో అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని స్పష్టం చేశారు. కొత్త గ్రామ పంచాయతీలుగా మారిన తండాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వీధి దీపాలకు సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తే బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు. ప్రయోగాత్మకంగా చిన్న గ్రామ పంచాయతీల్లో సోలార్ విద్యుత్ విధానాన్ని అమలు చేస్తూ, క్రమంగా అన్ని స్థానిక సంస్థలకు విస్తరిస్తూ నిజామాబాద్ ఉమ్మడి జిల్లాను ఆదర్శంగా నిలపాలని సూచించారు. అదేవిధంగా నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల్లో ఆదాయ వనరులు పెంపొందించుకునేందుకు ఉన్న అవకాశాలపై అధికారుల నుంచి సలహాలు స్వీకరించారు. వాటన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, చందర్ రాథోడ్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్‌లు, జెడ్పీ సీఈవోలు, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వాగతం..

ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు టి.వినయ్ కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్, నిజామాబాద్ సీపీ సాయి చైతన్య పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.



పాల్గొన్న ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులు

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన
- ఆపరేషన్ కగార్‌పేరుతో ఆదివాసీలను చంపుతున్నారు
- సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: ఐక్య పోరాటాలతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, భవిష్యత్‌కు బాటలు వేసేందుకు మహాసభలు దోహదపడుతాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో సీపీఐ 22వ జిల్లా మహాసభలను శనివారం నిర్వహించగా వెంకట్‌రెడ్డితోపాటు పశ్య పద్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని పార్టీలకు తల్లి పార్టీలు ఉన్నట్లు కమ్యూనిస్టు పార్టీలకు సీపీఐ తల్లివంటిదన్నారు. దేశంలో బలమైన పార్టీ సీపీఐ అని, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైన పార్టీ అని అన్నారు. యంత్రాలు లేని సమాజం కావాలని, శ్రమకు తగ్గ ఫలితం రావాలని, దోపిడీకి గురయ్యే వర్గానికి వెన్ను దన్నుగా గత 76 ఏళ్లుగా పేద ప్రజల కోసం పోరాడుతున్నామన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తోందని, కార్మిక, పేద వర్గాల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ప్రశ్నించినవారి గొంతునొక్కుతూ, అక్రమకేసులు బనాయించి జైళ్లలో వేస్తున్నారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను చంపుతున్నారని, వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని డిమాండ్ చేశారు. కేవలం అటవీసంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులను చంపగలరు కానీ సిద్ధాంతాన్ని చంపగలరా అని ప్రశ్నించారు. బీజేపీ - ఎన్డీఏ ప్రభుత్వానికి చెక్ పెట్టేందుకు సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సభలో నాయకులు ఓమయ్య, సుధాకర్, వేల్పూర్ భూమయ్య, సిర్ప లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో



బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్‌లోకి 2,078 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, ఆవిరి రూపంలో 277, తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1068.6(21.02 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం(2), బోటనీ(2) జూనియర్ లెక్చరర్ల పోస్టులు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెస్సీ, బీఈడీ విద్యార్హత కలిగి, బోధనలో మూడేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 23వ తేదీలోపు నాగారంలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల కళాశాలలో సమర్పించాలన్నారు. మిగతా వివరాలకు 98494 19469 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్: ఉపకార వేతనాల కోసం దరఖాస్తు గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు నూతన ఉపకార వేతనాలు, రెన్యువల్‌కు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాలికల కళాశాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను డీఐఈవో రవికుమార్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో తరగతుల నిర్వహణ, అధ్యాపకుల పనితీరును స్వయంగా పరిశీలించారు. జిల్లాలోనే అత్యధికంగా అడ్మిషన్లను చేయడంపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే అన్ని సబ్జెక్ట్‌ల అధ్యాపకులు సమన్వయంతో పని చేయాలన్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది అడ్మిషన్‌ల పనిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్‌ను కలిసిన సీపీ



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను సీపీ సాయిచైతన్య మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో రాజయ్యకు పుష్పగుచ్ఛం అందజేశారు.

వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలి

- పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలి
- జ్యోతీబాపూలే పాఠశాల/కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల/కళాశాల స్టోర్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఆయా సబ్జెక్టులలో చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందిస్తూ మెరుగైన ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని మహాత్మా జ్యోతీబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీలను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డైట్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని వివరాలు తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ ఉడకబెట్టిన కోడిగుడ్లు అందిస్తున్నారా, టెండర్ ప్రక్రియ పూర్తయిందా అని ఆరా తీశారు. భోజనం తయారు చేసేందుకు వినియోగించే ఆహార పదార్థాలు, సరుకులు, కూరగాయలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాసిరకమైన ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసిన సమయంలో అధికారులకు సమాచారం అందించాలన్నారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అంతకుముందు ఆఫీస్ రూంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్స్ ఎస్ దివ్యరాణి, ఎస్ లక్ష్మీలతో సమావేశమై, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పర్యవేక్షణ అధికారి ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పాఠశాల నిర్వహణను పక్కాగా పర్యవేక్షించాలని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది అటెండెన్స్, ఇతర రికార్డులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల రోజువారీ దినచర్య గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి, డిచ్‌పల్లి తహసీల్దార్ సతీష్ రెడ్డి తదితరులున్నారు.

జనాభా నియంత్రణతో ఆరోగ్యకర జీవితం

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: జనాభాను నియంత్రించడం ద్వారా మహిళలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించవచ్చని జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణకు తాత్కాలిక, శాశ్వత పద్ధతులను అవలంబించడం అభినందనీయమన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలను శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌వో రాజశ్రీ హాజరై మాట్లాడారు. తాత్కాలిక పద్ధతుల ద్వారా జనాభాను నియంత్రించవచ్చన్నారు. జనాభా నియంత్రణతో రక్తహీనత, మాతా శిశు మరణాలు, పోషకాహార లోపం, నిరుద్యోగ సమస్య, తక్కువ బరువుతో పుట్టే శిశువులను తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం శాశ్వత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన పలువురికి రూ.1000 చెక్కును అందజేశారు. గత సంవత్సర కాలంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో డీటీసీవో దేవీ నాగేశ్వరి, డీఎంవో డాక్టర్ తుకారం రాథోడ్, పీవోఎన్‌సీడీ డాక్టర్ సామ్రాట్ యాదవ్, పీవోఎంసీహెచ్ డాక్టర్ సుప్రియ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ రవీందర్, ఏవో రాజేశ్వర్, డీహెచ్‌ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డీపీహెచ్‌ఎన్‌వో స్వామి సులోచన, డీఎస్‌వో హరినాథ్ బాబు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్‌కు విద్యార్థి సంఘాల వినతి



విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎస్‌యూఐ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు విన్నవించారు. శనివారం తెయూను సందర్శించిన విద్యా కమిషన్ చైర్మన్ మురళి, సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావును వేర్వేరుగా కలిసిన ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు, ఫార్మసీ కళాశాల ఏర్పాటు, ఆడిటోరియం, నూతన బాలికల హాస్టల్ నిర్మాణం, బోధ న, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బానోత్ సాగర్‌నాయక్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేయించాలి

- పీసీసీ చీఫ్‌ను కలిసిన నాయకులు



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో అంతర్గత కొత్త రోడ్లతోపాటు పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీ అజారుద్దీన్, కాంగ్రెస్ నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, డీ రాజేంద్రప్రసాద్, బట్టు బలరాం, శివప్రసాద్, రాజేశ్ ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

- కాల్పోల్‌లో వైద్యుల బృందం పర్యటన

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామీణ ప్రాంతాల్లోని పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు బృందం సూచించింది. మండలంలోని కాల్పోల్‌లో డెంగీ కేసులు నమోదైన నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వైద్య బృందాలను శనివారం గ్రామానికి పంపింది. దీంతో వైద్య బృందాలు గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాయి. ప్రధానంగా వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేస్తూ, దోమల లార్వా నిర్మూలనకు మందును స్ప్రే చేశారు. గ్రామంలో ఆరోగ్య శిబిరం నిర్వహించి జ్వర పీడితులను పరీక్షించి మందులను అందజేశారు. మెరుగైన చికిత్స అవసరమున్న వారిని జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, వైద్యులు ప్రత్యేష, అజ్మల్, హెచ్‌ఈవో గోవర్ధన్,సూపరింటెండెంట్లు,ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



కాల్పోల్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న మలేరియా అధికారి తుకారాం రాథోడ్



మదన్‌పల్లిలో బాధితురాలితో మాట్లాడుతున్న ఎంపీడీవో బ్రహ్మానందం, వైద్య సిబ్బంది

మదన్‌పల్లిలో ఒకరికి డెంగీ

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ డెంగీ బారినపడింది. విషయం తెలుసుకున్న కల్లెడి పీహెచ్‌సీ వైద్యుడు ప్రకాశ్ అప్రమత్తమై ఆరోగ్య సిబ్బందితో కలిసి శనివారం మదన్‌పల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 20 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా, జ్వరం, డెంగీ లక్షణాలు కనిపించలేదు. కాగా, 15 రోజుల క్రితం సదరు మహిళ బోధన్‌లో ఉండే తన తల్లి వద్దకు వెళ్లింది. తిరిగి మదన్‌పల్లి వచ్చిన తర్వాత విపరీతమైన జ్వరం, తలనొప్పి రావటంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ జరిపిన రక్త పరీక్షల్లో డెంగీ పాజిటివ్ రావడంతో చికిత్స పొంది మదన్‌పల్లి చేరుకుంది. విషయం తెలియడంతో డాక్టర్ ప్రకాశ్ వెంటనే గ్రామంలో ఉన్న డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. బోధన్‌లో దోమ కుట్టడంతోనే డెంగీ వచ్చినట్లు డాక్టర్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డెంగీ తగ్గడంతో విశ్రాంతి తీసుకుంటున్న మహిళను ఎంపీడీవో బ్రహ్మానందం పరామర్శించారు.

క్రైం కార్నర్

రెండు గ్రామాల్లో దొంగల బీభత్సం

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- ధర్మారావ్‌పేట్, మర్కల్‌లో చోరీకి పాల్పడ్డ దుండగులు



మర్కల్‌లోని ఓ సీసీ ఫుటేజీలో రికార్డయిన దుండగుల దృశ్యం



ధర్మారావ్‌పేట్‌లోని ఓ ఇంట్లో పడి ఉన్న సామగ్రి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్, మర్కల్ గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ధర్మారావ్‌పేట్ గ్రామానికి చెందిన షహరీ బేగం, ఉరుసు పుష్ప, ఒడ్డె రాములు ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో దుండగులు ఇంటి తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ముగ్గురు ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. మర్కల్ గ్రామానికి చెందిన గుర్రం పుష్ప, శాంత ఇళ్లకు తాళం వేసి ఉండడంతో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కాగా, మర్కల్‌లో అర్ధరాత్రి ఓ కాలనీలో తిరుగుతున్న ఐదుగురు వ్యక్తుల దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. మర్కల్, ధర్మారావ్‌పేట్‌లో చోరీకి పాల్పడింది ఒకే ముఠానా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. చోరీకి గురైన నగదు, బంగారం విలువ విచారణలో తెలుస్తుందని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ సంతోష్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, సిబ్బంది ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి



ఇరగదిండ్ల శంకర్ మృతదేహం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని శుక్రవారం దేవీ ఆలయం సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. హసకొత్తూర్ గ్రామానికి చెందిన ఇరగదిండ్ల శంకర్(27) ద్విచక్ర వాహనంపై కమ్మర్‌పల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో శుక్రవారం దేవీ ఆలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

పోచంపాడ్‌లో కార్డన్ సెర్చ్



బాల్కొండ:మెండోరా మండలం పోచంపాడ్‌లో శనివారం సాయంత్రం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాల ను సీజ్ చేశారు.వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దివ్యాంగుల రైల్వే పాస్‌లకు దరఖాస్తులు

మీకు తెలుసా?

ఖలీల్‌వాడి: ఆన్‌లైన్‌లో దివ్యాంగులకు రైల్వే శాఖ పాసులు అందిస్తోంది. బుకింగ్ కౌంటర్ల వద్దకు వెళ్లి గంటల తరబడి పాసుల కోసం వేచి ఉండకుండా నేరుగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే ఫోన్ నంబర్‌కు 45 రోజుల్లో మెసేజ్ వస్తుందని రైల్వే అధికారులు చెప్తున్నారు.

అప్లయ్ చేసుకోవడం ఇలా..

- మొదట www. divyangianid. indianrail. gov. in వైబ్‌సైట్‌లోకి వెళ్లి అందులో ఉన్న భాషను ఎంచుకోవాలి.
- పేజీని ఓపెన్ చేసి ఆధార్, ఫోన్ నంబరు లేదా ఈ-మెయిల్ ఐడీతో లాగిన్ ఐడీని ఒకేసారి ఉపయోగిస్తే ఓటీపీతో నమోదు చేసుకోవాలి.
- పూర్తి చిరునామా, ఫొటోలు, సర్టిఫికెట్లను పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలి.
- వెబ్‌సైట్‌లో ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ల వివరాలు స్పష్టంగా ఉండాలి.
- జనన ధ్రువీకరణపత్రం, పాస్‌పోర్టు, టెన్త్ సర్టిఫికెట్(ఉంటేనే) ఇతర పత్రాలను పీడీఎఫ్ చేసి పొందుపర్చాలి.

విద్యార్థులు కావలెను

- ఎస్సీ వసతి గృహాలలో భారీగా ఖాళీలు
- గురుకులాల్లో చేరికకు ఉత్సాహం చూపడంతో భర్తీకాని సీట్లు



భీమ్‌గల్‌లో ఎస్సీ బాలుర వసతి గృహం

మోర్తాడ్: ఎస్సీ విద్యార్థి వసతి గృహాలలో సీట్లు భర్తీ కాక వెలవెలబోతున్నాయి. గురుకుల పాఠశాలల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడంతో వసతి గృహాలలో సీట్లు నిండటం లేదు. ఆర్మూర్ డివిజన్‌లోని పలు వసతి గృహాలలో సీట్లు ఖాళీగా ఉండటంతో వాటిని భర్తీ చేసేందుకు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు అవస్థలు పడుతున్నారు. ఒక్కో హాస్టల్‌లో వంద మంది విద్యార్థులకు వసతి కల్పించే వీలు ఉంది. కొన్ని హాస్టళ్లలో సీట్లు నిండిపోగా, ఎక్కువ వసతి గృహాలలో ఖాళీలే దర్శనం ఇస్తున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు దుస్తులు, దుప్పట్లు, ఉచిత నోట్ పుస్తకాలు అందిస్తూ కాస్మెటిక్ చార్జీలను చెల్లిస్తున్నారు. మోర్తాడ్‌లోని బాలుర, బాలికల వసతి గృహాలతోపాటు వేల్పూర్, తొర్లికొండ, కోనసముందర్, ఆర్మూర్‌లోని బాలుర వసతి గృహాలలో సీట్లు భర్తీ అయ్యాయి. కాగా, ఏర్గట్లలో(30), చౌట్‌పల్లి(30), భీమ్‌గల్ బాలికల వసతి గృహంలో(35), బాలుర(50), ఆర్మూర్‌లోని బాలికల వసతి గృహంలో(50) సీట్లు ఖాళీగా ఉన్నాయి.

మెరుగైన వసతులున్నాయి..

ఎస్సీ విద్యార్థి వసతి గృహాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎస్సీ, బీసీ, ఎస్టీ విద్యార్థులు అందుబాటులో ఉన్న ఎస్సీ వసతి గృహాలలో చేరితే ఉపయోగంగా ఉంటుంది.ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రయత్నిస్తున్నాం.

– రాజగంగారాం, ఏఎస్‌డబ్ల్యూ, ఎస్సీ సంక్షేమ శాఖ

టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించాలి

- సీపీ సాయి చైతన్య
- కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు ఈ–సమన్లపై శిక్షణ



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: ప్రతి కేసులో సంబంధిత వ్యక్తులకు సమయానుగుణంగా ఈ–సమన్లు జారీ చేయాలని, పారదర్శకత, వేగవంతమైన సేవలకు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ హాల్‌లో కోర్ట్ డ్యూటీ ఆఫీసర్లకు ఈ–సమన్లపై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ–సమన్ల జారీకి సంబంధిత డిజిటల్ ప్లాట్ ఫామ్‌ను వాడడంలో శిక్షణ తీసుకొని, ప్రతి ఆదేశాన్ని రికార్డు చేయాలని సూచించారు. కోర్టుల నుంచి జారీ అయ్యే సమన్లను త్వరితగతిన సర్వ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్యాం కుమార్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, ఐటీ కోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

- ఎన్డీఎస్ఎల్ ఎదుట కార్మిక సంఘాల నిరసన



బోధన్ ఎన్డీఎస్ఎల్ ప్రధాన గేట్ ఎదుట నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

బోధన్: పదేళ్ల బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్ ఎన్డీఎస్ఎల్ (నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్) ఎదుట కార్మిక సంఘాలు, రైతు నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ 2015 డిసెంబర్ 23న అక్రమంగా లేఆఫ్ ప్రకటించి షుగర్ ఫ్యాక్టరీని మూసివేయడంతో ఉపాధి కోల్పోయామని, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం కారణాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, పిల్లల పోషణకు నరకయాతన పడుతున్నామని పేర్కొన్నారు. బకాయి వేతనాలు చెల్లించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ కాలయాపన కమిటీగా ఉందని ఆరోపించారు. ఫ్యాక్టరీని పున: ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, రవిశంకర్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్, భిక్షపతి, రైతు నాయకుడు కేపీ శ్రీనివాస్ రెడ్డి, ఫయాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ అడిగి దారి దోపిడీ

కామారెడ్డి క్రైం: అప్పుడే పరిచయమైన ఓ మహిళకు లిఫ్ట్ ఇచ్చి దోపిడీకి గురైన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలో శనివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. దోమకొండ మండలం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన చిన్న గంగయ్య శుక్రవారం సాయంత్రం కామారెడ్డికి వచ్చి ఓ కల్లు దుకాణంలో కల్లు సేవించాడు. అక్కడే ఉన్న ఇద్దరు మహిళలు అతనితో పరిచయం ఏర్పరచుకున్నారు. ఓ మహిళ చింతమాన్‌పల్లి వెళ్లే దారిలో తనను దింపేయాలని అడిగి బైక్‌పై ఎక్కింది. కొద్దిదూరం వెళ్లిన తర్వాత మరో కల్లు దుకాణం వద్ద ఆగిన గంగయ్య మరికొంత కల్లు సేవించాడు. ఆ తర్వాత ఇద్దరూ బయల్దేరి పట్టణ శివారు ప్రాంతంలోకి వెళ్లాక ఇద్దరు వ్యక్తులు వచ్చి వారి బైక్‌ను ఆపారు. తన భార్యను ఎక్కడికి తీసుకెళ్తున్నావంటూ ఓ వ్యక్తి గంగయ్యపై దాడి చేశాడు. అనంతరం గంగయ్య వద్ద ఉన్న రూ. 28 వేలను లాక్కొని అక్కడి నుంచి ముగ్గురూ పరారయ్యారు. శనివారం బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు.

కార్మిక శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా మాణిక్ రాజు



నిజామాబాద్ లీగల్: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది బీ మాణిక్ రాజును జిల్లా కార్మిక శాఖ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరపున న్యాయవాది మాణిక్‌రాజును సభ్యునిగా నియమించారు. భవన నిర్మాణ కార్మిక సంఘాలతో కలిసి సంక్షేమ పథకాలు కార్మికులకు చేరేలా మాణిక్ రాజు కృషి చేశారు. కార్మిక చట్టాలు వాటి ప్రయోజనాలపై న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. పదుల సంఖ్యలో కార్మికులకు తన సొంత డబ్బుతో బీమా సౌకర్యం కల్పించారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియామకమైన మాణిక్ రాజును న్యాయవాదులు అభినందించారు.

ఆర్టీసీ బస్సు, ఇసుక లారీ ఢీ

- రోడ్డు కిందికి దూసుకెళ్లిన బస్సు
- పలువురికి తీవ్ర గాయాలు
- భయాందోళనలకు గురైన ప్రయాణికులు



రోడ్డు కిందికి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

లింగంపేట: ఎదురెదురుగా వస్తున్న ఇసుక లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం లింగంపేటవైపు నుంచి కామారెడ్డి వైపు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. బస్సులో 102 మంది ప్రయాణికులున్నారు. అదే సమయంలో కామారెడ్డి వైపు నుంచి లింగంపేట వైపు ఇసుక లారీ వస్తోంది. లింగంపేట మండలం ఎల్లమ్మతండా సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు రోడ్డు కిందికి దూసుకుపోయింది. ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. లారీ డ్రైవర్ లింగంపేట మండలం పర్మళ్ల గ్రామానికి చెందిన బద్ద నాగరాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అతడి కుడి కాలు విరిగింది. బస్సు డ్రైవర్ వడ్ల శ్రావణ్‌కుమార్‌కూ గాయాలయ్యాయి. ఆయన స్వస్థలం లింగంపేట మండలం కొర్పోల్ గ్రామం. కండక్టర్ శంకర్‌రావుతోపాటు ప్రయాణికులు బూక్య మంజుల(అన్నారం), ఉంట గంగారెడ్డి(మర్కంటి), కుంట బాలరాజవ్వ(మర్కంటి), పురుషోత్తం(డిచ్‌పల్లి), పోచయ్య(కన్కల్), లింగమోల్ల రాజు(శెట్పల్లిసంగారెడ్డి), ప్రవంతి(పోతారం), సత్తవ్వ(శెట్పల్లిసంగారెడ్డి), చాకలి రాజేష్(కుప్రియాల్), నక్క రాజమణి(దూస్‌గావ్), బ్రహ్మణపల్లి లక్ష్మి(తాడ్వాయి), అల్లిపురం అంజవ్వ(కాళోజీవాడి), పడమటి సుశీల(ఆరెపల్లి)లకు గాయాలయ్యాయని ప్రయాణికులు తెలిపారు. వీరిని సదాశివనగర్, దోమకొండ, రాజంపేట మండలాలకు చెందిన 108 అంబులెన్సులలో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, లింగంపేట ఎస్సై దీపక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.